సాక్షి
వికారాబాద్
ఆదివారం । 19 । మే । 2024



వానలు వణికిస్తున్నాయి

అకాల వర్షాలు రైతులకు కునుకు లేకుండా చేస్తున్నాయి. ధాన్యం తడిసి పాడవుతుందేమోనని ఆందోళన చెందుతున్నారు. 8లో▸



రాకపోకలు ఎట్లా?

రెండేళ్ల క్రితం ప్రారంభించిన డబుల్ రోడ్డు పనులు అసంపూర్తిగా ఉండడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. 9లో▸



ర్యాంకుల పంట

ఈఏపీసెట్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో జిల్లా విద్యార్థులు అబ్బురపరిచే ర్యాంకులు సాధించారు. 9లో▸

న్యూస్‌రీల్

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కుల్కచర్ల: గిరిజన గురుకుల కళాశాలలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని గిరిజన గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ గంగారాంనాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. గురుకుల కళాశాలలో ప్రవేశాలకు గాను ఈనెల 23న మానసా హిల్స్, రాజేంద్రనగర్ ప్రాంతీయ కార్యాలయంలో ఉదయం 10:30లకు స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. అర్హులైన గిరిజన విద్యార్థులు తమ విద్యార్హతకు సంబంధించిన ధ్రువపత్రాలతో హాజరవ్వాలని సూచించారు. వివరాలకు 9490957319, 9441367764 నంబర్లను సంప్రదించాలని కోరారు.

నిధుల మంజూరుకు నివేదిక

- మార్కెట్ యార్డులోని సమస్యలను పరిష్కరిస్తాం
- పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



మార్కెట్ యార్డును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: పరిగి మార్కెట్ యార్డులోని సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన పట్టణ కేంద్రంలోని మార్కెట్ యార్డును సందర్శించారు. రైతులను, వ్యాపారస్తులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. త్వరలోనే మార్కెట్ యార్డును అన్నివిధాల అభివృద్ధి చేస్తామన్నారు. నిధుల కేటాయింపునకు ఇప్పటికే అధికారులు నివేదిక తయారుచేసే పనిలో ఉన్నారన్నారు. వర్షం నీరు నిలిచి రోడ్లు బురదమయంగా మారినందున తాత్కాలికంగా పరిష్కరించి తదనంతరం శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. రైతుల ఇబ్బందులు తలెత్తకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. ఆయన వెంట వివిధ శాఖల అధికారులు, నాయకులున్నారు.

గ్రూప్‌-1 ప్రిలిమినరీ పరీక్షకు ఏర్పాట్లు

అదనపు కలెక్టర్ రాహుల్‌శర్మ



మాట్లాడుతున్న రాహుల్ శర్మ

అనంతగిరి: గ్రూప్‌–1 ప్రిలిమినరీ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని అడిషనల్ కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. జూన్ 9న నిర్వహించే ఈ పరీక్షకు సంబంధించి శనివారం రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్‌రెడ్డి ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, అదనపు కలెక్టర్లు, అదనపు ఎస్పీలు, జిల్లా నోడల్ అధికారులు, పోలీస్ నోడల్ అధికారులు, రీజినల్ కోఆర్డినేటర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం రాహుల్ శర్మ మాట్లాడుతూ.. జిల్లాలో 5,468 మంది అభ్యర్థులు పరీక్ష రాసేందుకు వీలుగా 13 కేంద్రాలను గుర్తించామన్నారు. వికారాబాద్‌లో ఏడు, తాండూరులో నాలుగు, పరిగిలో రెండు కేంద్రాలను పరీక్ష కేంద్రాలను సిద్ధం చేస్తున్నామన్నారు. టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్ సూచనల మేరకు అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మౌలిక సదుపాయాలు, నిరంతర విద్యుత్, టాయిలెట్స్, తాగునీరు ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం ఎస్పీ కోటిరెడ్డి మాట్లాడుతూ.. పరీక్షకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఏఎస్పీ రవీందర్ రెడ్డి, కలెక్టరేట్ ఏఓ అమరేందర్ కృష్ణ తదితరులున్నారు.

కొనుగోలు.. దిగాలు!

అధికారుల సమన్వయ లోపం.. నగదు చెల్లింపులో జాప్యం

- నెల గడిచినా 20 శాతం దాటని కొనుగోలు లక్ష్యం
- సేకరించిన ధాన్యం 18,800 మెట్రిక్ టన్నులే..
- రైతుల ఖాతాల్లో జమ చేసిన నగదు రూ.4.88 కోట్లు



దోమ మండలం బొంపల్లిలో విక్రయించేందుకు ఉంచిన ధాన్యం

వికారాబాద్: అధికారులు.. శాఖల మధ్య సమన్వయ లోపంతో అన్నదాతకు కష్టాలు తప్పడం లేదు. సూర్తిళ్ల సమయంలో అడపాదడపా కురుస్తున్న అకాల వర్షాలతో ఓ పక్క అన్నదాత కష్టాలు పడుతుంటే మరో పక్క శాఖల మధ్య సమన్వయ లోపం మరింత కుంగదీస్తోంది. దీంతో కొనుగోళ్లు మందకొడిగా సాగుతున్నాయి. కొనుగోలు చేసిన ధాన్యానికి డబ్బుల చెల్లింపులోనూ తీవ్ర జాప్యం జరుగుతోంది. కొనుగోలు ప్రక్రియ పూర్తైన మూడు రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని జిల్లా అధికారులు చెబుతుండగా క్షేత్ర స్థాయిలో అందుకు విరుద్ధంగా జరుగుతోంది. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి వారాలు గడిచినా ఖాతాల్లో నగదు జమ కావడం లేదు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నెల గడుస్తుండగా ఇంకా టార్గెట్‌లో 20 శాతానికి మించి ధాన్యం కొనుగోలు చేయలేదు. ఇదే సమయంలో కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి 15 శాతానికి మించి రైతుల ఖాతాల్లో నగదు జమకాలేదు. దీంతో రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలంటే జంకుతున్నారు. ధర తక్కువైనా ప్రైవేటు వ్యక్తులు, దళారులకే విక్రయిస్తున్నారు.

నగదు జమ ఆలస్యం

యాసంగి సీజన్‌కి సంబంధించి జిల్లాలో 90వేల ఎకరాల్లో వరిసాగు చేయగా ఇందులో ఎకరానికి 18 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఈ లెక్కన జిల్లాలో మొత్తం 1.7లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తే 1.2లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించేందుకు లక్ష్యం పెట్టుకున్నారు. జిల్లాలో 129 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు చేసి నెల గడిచినా వాటి ద్వారా 18,800 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. అధికారులు జిల్లాకు సంబంధించి నిర్దేశించుకున్న లక్ష్యంలో 20 శాతం ధాన్యం కూడా కొనుగోలు చేయలేదు. ఇదే సమయంలో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి నగదు జమ చేయడంలోనూ తీవ్ర జాప్యం చోటు చేసుకుంటోంది. ఒక్కో కేంద్రంలో ధాన్యం విక్రయించి 20 రోజులు దాటినా నగదు జమ కావడం లేదని రైతులు వాపోతున్నారు. కొనుగోలు చేసిన ధాన్యానికి రూ.39.48కోట్లు చెల్లించాల్సి ఉండగా ఇప్పటి వరకు రూ.4.88 కోట్లు మాత్రమే చెల్లించారు.

సమన్వయలోపమే కారణం

పౌరసరఫరాల శాఖ పర్యవేక్షణలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తోంది. డీఆర్డీఏ, పీఏసీఎస్, డీసీఎంఎస్ తదితర శాఖలు ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తున్నాయి. ఈ ప్రక్రియలో సెంటర్ల ద్వారా రైతుల నుంచి కొనుగోలు చేయటంతో పాటు డాటాను ట్యాబ్ ఎంట్రీ చేయటం, వాటిని మిల్లర్లకు చేర్చడం చేయాలి. తమకు ధాన్యం చేరిందని మిల్లర్లు అక్నాలెడ్జ్‌మెంట్ ఇవ్వగానే సివిల్ సప్లై అధికారులు ప్రభుత్వానికి ఇండెంట్ పంపి రైతుల ఖాతాల్లో నగదు జమ అయ్యేలా చూస్తారు. అయితే కొనుగోలు కేంద్రాలు నిర్వహిస్తున్న శాఖలు ట్యాబ్ వివరాలు ఎంట్రీ చేయడంలో తాత్సారం చేయడంతో రైతుల ఖాతాల్లో నగదు జమ ఆలస్యమవుతోందని సివిల్ సప్లై అధికారులు వెల్లడిస్తున్నారు. మేం వెంటనే చేస్తున్నాం జమ చేయడంలోనే ఆలస్యమవుతోందని సంబంధిత శాఖల వారు పేర్కొంటున్నారు. ఆయా శాఖ సమన్వయ లోపంతోనే నగదు జమ చేసేందుకు ఆలస్యమవుతోందని స్పష్టమవుతోంది.

“ బిల్లులు రావట్లే



కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్మి పది రోజులయింది. నిర్వాహకులతో బిల్లులు చేయించుకున్నప్పటికీ ఖాతాలో నగదు వేయలేదు. 138 బ్యాగులు వరి ధాన్యం పండించగా, వాటిని కొనుగోలు కేంద్రంలో విక్రయించా. తరుగు పేరిట మూడు బ్యాగులు కట్ చేశారు.

– వర్త్యా ఛత్రియా, రైతు, బొంపల్లితండా

రసీదు ఇవ్వగానే నగదు జమ



కొనుగోలు సంబంధించిన నగదును వీలైనంత త్వరగా వారి ఖాతాలో జమ చేస్తున్నాం. కొనుగోలు కేంద్రం వద్ద డేటాను ట్యాబ్‌లో ఎంట్రీ చేసి మిల్లర్లకు ధాన్యం పంపాలి. వారి నుంచి తీసుకున్న రసీదు ఇచ్చిన వెంటనే రైతుల ఖాతాలో నగదు వేస్తున్నాం. మూడు రోజుల్లోనే ఈ ప్రక్రియ పూర్తి చేస్తున్నాం.

– సుగుణబాయి, సివిల్ సప్లై జిల్లా మేనేజర్



యాలాల: బెన్నూరు కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం పరిశీలిస్తున్న లింగ్యానాయక్

ప్రతీ గింజ కొనుగోలు చేస్తాం

- ఇప్పటికే 18వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొన్నాం
- రైతులను ఇబ్బంది పెడితే చర్యలు
- అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

తాండూరు రూరల్: రైతుల నుంచి ప్రతీ గింజను కొనుగో చేస్తామని జిల్లా అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. శనివారం ఆయన మండల పరిధిలోని చెంగోల్ వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా లింగ్యానాయక్ మాట్లాడుతూ.. జిల్లాలో 129 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని.. లక్షా19వేల మెట్రిక్ టన్నుల వడ్లు కొనుగోలు చేయాలని టార్గెట్ ఉందన్నారు. ఇప్పటికే 18వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. గన్నీ బ్యాగుల కొరత లేదని.. తూకం వేసిన ధాన్యాన్ని లారీల ద్వారా మిల్లర్లకు తరలిస్తున్నామన్నారు. అధికారులు రైతులను ఇబ్బంది పెట్టొద్దని ఆదేశించారు. వడ్ల కొనుగోలులో వేగం పెంచాలని సూచించారు. ఆయన వెంట జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి రాజేశ్వర్, డీసీఎంఎస్ ఇంచార్జి ఎల్లయ్య ఉన్నారు.

కూలీల సంఖ్య పెంచండి

యాలాల: మద్దతు ధరతో రైతులు పండించిన ప్రతీ ధాన్యపు గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. శనివారం ఆయన మండల పరిధిలోని బెన్నూరు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. అనంతరం పలువురు రైతులతో మాట్లాడారు. ధాన్యం తడవకుండా టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉంచాలన్నారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లర్లకు చేరేలా కూలీల సంఖ్యను పెంచాలన్నారు. రైతుల ధాన్యం తూకం అనంతరం ఎప్పటికప్పుడు వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సూచించారు. ఆయన వెంట జిల్లా పౌరసరఫరాల అధికారి రాజేశ్వర్, డీసీఎంఎస్ మేనేజర్ మల్లయ్య, కేంద్రం ఇన్‌చార్జి అబ్దుల్ సలాం ఉన్నారు.

ప్రతీ కేంద్రానికి 30 టార్పాలిన్లు

పెద్దేముల్: రైతులను ఇబ్బంది పెడితే చర్యలు తీసుకుంటామని ధాన్యం కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జిలను అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ హెచ్చరించారు. శనివారం ఆయన మండల పరిధిలోని మంబాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ సెంటర్ 30 చొప్పున టార్పాలిన్ కవర్లు అందజేస్తామని వాటిని రైతులకు అందుబాటులో ఉంచాలన్నారు. ధాన్యం సేకరించిన వెంటనే ఆన్‌లైన్ చేయాలన్నారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోవద్దన్నారు. కేంద్రాల వద్ద కూలీల సంఖ్య పెంచాలని, నాణ్యమైన బార్దాన్ ఇవ్వాలని రైతులు కలెక్టర్‌ను విన్నవించారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారు. ఆయన వెంట పెద్దేముల్ డిప్యూటీ తహసీల్దార్ మహేశ్, తాండూరు డీసీఎంఎస్ ఇన్‌చార్జి ఎల్లయ్య, పెద్దేముల్ మండల ఇన్‌చార్జిలు సుదర్శన్‌రెడ్డి, నజీర్ తదితరులున్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

చట్టాలపై అవగాహన అవసరం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

అనంతగిరి: చట్టాలపై ప్రతీ ఒక్కరికి అవగాహన అవసరమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్ డాక్టర్ ఎస్.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం అత్తేల్లి గ్రామంలో అంకిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ సహకారంతో న్యాయ అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. చట్టాలపై అవగాహన పెంచుకుని హక్కులు సాధించుకోవాలన్నారు. బడీడు పిల్లలను పాఠశాలకు పంపాలని సూచించారు. బాల్యవివాహాలు నేరమన్నారు. భవన నిర్మాణ రంగ కార్మికు లు లేబర్ కార్డులు తీసుకుని ప్రయోజనాలు, ఇన్సూరెన్స్‌లను వినియోగించుకోవాలని సూచించారు. నిరుపేదలకు కోర్టు కేసులుంటే డీఎల్‌ఎస్‌ఏలో న్యాయమూర్తికి దరఖాస్తు చేసుకుంటే వారికి కోర్టు నుంచి ఒక అడ్వకేట్‌ను కేటాయించి కేసు స్వీకరిస్తా రని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంకిత సంస్థ జి ల్లా కోఆర్డినేటర్ ప్రకాశ్‌కుమార్, ఎస్‌ఐ సత్యనారాయణ, లీగల్ సెల్ న్యాయవాదులు వెంకటేశ్, రా ము, పంచాయతీ కార్యదర్శి కృష్ణారెడ్డి, డీఎల్‌ఎస్‌ఏ సూపరింటెండెంట్ హమీద్, సంస్థ సలహాదారుడు టి.వెంకటయ్య, కోఆర్డినేటర్ సంజీవ్, ఫీల్డ్ అసిస్టెంట్ రత్నం, బ్రాంచ్ పోస్టు మాస్టర్ ఆరిఫ్ పాల్గొన్నారు.

8న జాతీయ లోక్‌అదాలత్

జూన్ 8న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌ను వినియోగించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ ఎస్.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా కోర్టు భవనం ఆవరణలో పోలీసులతో కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కేసులు రాజీచేసేందుకు పోలీసులు చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్జిలు డీబీ శీతల్, శ్రీకాంత్, శ్రుతిదూత, పీపీలు అన్వేష్‌సింగ్, సమీనాబేగం, ఎ స్పీ కోటిరెడ్డి, డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, బాలకృష్ణారె డ్డి, కరుణాసాగర్‌రెడ్డి, సీఐ నాగరాజు పాల్గొన్నారు.

ఖైదీలకు డిఫెన్స్ లాయర్

పరిగి: క్షణికావేశంలో చేసిన తప్పులతో కుటుంబ సభ్యులు క్షోభ పడుతారని జిల్లా జడ్జి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన పరిగి సబ్‌జైల్‌ను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. జైలు జీవితం అనంతరం మళ్లీ తప్పులు చేయొద్దన్నారు. కుటుంబంపై బాధ్యతతో వ్యవహరించాలన్నారు. ఆర్థిక స్థోమత లేని ఖైదీలకు జిల్లా న్యాయసేవా సంస్థ నుంచి ఉచితంగా డిఫెన్స్ లాయర్‌ను కేటాయిస్తారని.. బెయిల్ మంజూరు చేస్తారని వివరించారు. ఆయన వెంట జైల్ సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, లీగల్ డిఫెన్స్ లాయర్ రాము, వెంకటేశ్, సిబ్బంది విశ్వనాథరావు, పరమయ్య, శ్రీను ఉన్నారు.

పంట ప్రణాళిక రెడీ

జిల్లాలో 5.97 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యే అవకాశం

- 38,530 క్వింటాళ్ల విత్తనాలు, 75,435 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం
- వారం ముందే అందుబాటులోకి విత్తనాలు, ఎరువులు
- ఏర్పాట్లలో నిమగ్నమైన వ్యవసాయశాఖ అధికారులు



తాండూరు: వానాకాలం పంటలకు వ్యవసాయ శాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. వానాకాలంలో పంటల సాగుకు అనుకూలమైన వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. సాగుకు రైతులు భూములను దుక్కులను దున్ని సిద్ధం చేసుకొంటున్నారు. తొలకరి వర్షాలు కురిసిన వెంటనే రైతులు పొలం బాట పట్టేందుకు రెడీ అవుతున్నారు. అందుకోసం ఇప్పటి నుంచే విత్తనాలు, ఎరువులను సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. వానాకాలం సాగులో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లాలో పంటల సాగుకు కావాల్సిన ఎరువులు, విత్తనాల నిల్వలను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకొన్నారు. జిల్లాలో 5.97 లక్షల ఎకరాల్లో సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలను కొరత రాకుండా జిల్లా వ్యవసాయ శాఖ పటిష్టమైన చర్యలు చేపట్టింది.

పప్పు దినుసులు, నూనె గింజల సాగుకు దృష్టి

వికారాబాద్ జిల్లాలో 20 మండలాల్లో రైతులు వానాకాలం పంటల సాగుకు సిద్ధమవుతున్నారు. వ్యవసాయ పంచాంగం ప్రకారం రోహిణి కార్తె నుంచి వానాకాలం పంటల సాగుకు సమయాత్తమవుతారు. ప్రధానంగా జిల్లాలో పత్తి, కంది, వరి, పెసర, మొక్క జొన్న, మినుము తదితర పంటలను వేయనున్నారు. పప్పు దినుసులు, నూనె గింజల సాగుపై ప్రత్యేక దృష్టి సారించారు. తేలికపాటి భూముల్లో 50 మిల్లీమీటర్ల వర్షపాతం, నల్లరేగడి నేలల్లో 75 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైన తర్వాత విత్తనాలను విత్తుకోవాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. నైరుతి రుతుపవనాలు ఈ సారి సమయానికి రాష్ట్రాన్ని తాకుతున్నాయని వాతావరణ శాఖ వెల్లడించింది.

వానాకాలం సాగుకు..

ఎరువులు	టన్నుల్లో
యూరియా	32,329
డీఏపీ	17,719
ఎంఓపీ	3,658
కాంప్లెక్స్	19,877
ఎస్ఎస్‌పీ	1,854

పొలం బాట పట్టిన రైతులు

వానాకాలం సాగుకు వేసవిలోనే రైతులు తమ భూములను లోతైన దుక్కులు దున్నుకున్నారు. ఈ వేసవి సీజన్‌లో నాలుగు రోజుల క్రితం వరకు 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవ్వడంతో భూములు నెర్రలు బారాయి. నాలుగు రోజులుగా వాతావరణం చల్లబడింది. మరోవైపు జిల్లాలో అడపాదడపా వర్షాలు కురిశాయి. పలుచోట్ల భూములను చదును చేసుకుని వర్షాల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు.

ఎరువులకు ఏర్పాట్లు

వానాకాలం పంటలను సాగు చేసేందుకు 75,437 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని వ్యవసాయ శాఖ అధికారులు ధ్రువీకరించారు. అందుకు జిల్లాలో ఉన్న ఎరువులు, విత్తన దుకాణాల్లో వానాకాలం సాగుకు సరిపడ ఎరువులను అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు మొదలు పెట్టారు. ఇప్పటికే పలు దుకాణాలలో విత్తనాలు, ఎరువులు చేరుకున్నాయి. ఎరువుల కొరత తలెత్తకుండా ఉండేందుకు ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.

“ విత్తన, ఎరువుల కొరత రాకుండా చర్యలు



జిల్లాలో వానాకాలం సాగుకు ప్రణాళిక సిద్ధం చేశాం. జిల్లా వ్యాప్తంగా 5.97లక్షల ఎకరాల్లో పంటల సాగుకు కావాల్సిన ఎరువులు, విత్తనాల కొరత రాకుండా చర్యలు తీసుకొంటున్నాం. విత్తనాల ఎంపిక విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి. దళారులను నమ్మి నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి నష్టపోవద్దు. పంటలను సాగు చేస్తున్న రైతులు స్థానిక వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలి. మండలాల్లో ఏఓలు, ఏఈఓలు అందుబాటులో ఉంటారు. మోతాదుకు మించి ఎరువులను వాడటం వల్ల పంటల దెబ్బ తింటాయి. మేలైన రకం విత్తనాలను ఉపయోగించాలి. నాణ్యమైన విత్తనాలతోనే పంట దిగుబడులు బాగుంటాయి. భారీ వర్షాలు కురిశాకే భూమిలో విత్తనాలు విత్తుకోవాలి.

– గోపాల్, జిల్లా వ్యవసాయాధికారి

జిల్లాలో సాగు చేసే పంటలు

పంట సాగు	సాధారణ విస్తీర్ణం	విత్తనాలు (క్వింటాళ్లలో)
పత్తి	2,63,500	5,42,400(ప్యాకెట్‌లు)
కంది	1,50,000	4,500
ఎర్ర మిర్చి	180	0.18కిలోలు
పెసర	13,000	1,040
మినుము	5,000	400
జొన్న	2,500	100
సోయ	2,500	750
వేరుశనగ	500	300
వరి	1,10,000	4,500
మొక్కజొన్న	50,450	4,036
ఆముదం	20	0.40కిలోలు
నువ్వులు	70	1.75
సజ్జలు	10	0.20 కిలోలు
రాగులు	100	2 క్వింటాళ్లు
మొత్తం	5,97,830	38,630

టీఎస్ స్థానంలో టీజీ

కలెక్టర్ నారాయణరెడ్డి



అనంతగిరి: తెలంగాణ సంక్షిప్త పదాన్ని టీఎస్‌కు బదులుగా టీజీగా మార్చాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీఓలు, నోటిఫికేషన్లు, నివేదికలు, లెటర్ హెడ్‌లు, రిపోర్టులు, నోటిఫికేషన్స్, నేమ్ బోర్డులు, వెబ్‌సైట్స్ టీజీగా ఉండాలని, ప్రభుత్వ శాఖలు, సంస్థలు, అటనామస్ విభాగాలన్నీ దీన్ని పాటించాలని ఆదేశించారు. ఇప్పటివరకు వాహనాల రిజిస్ట్రేషన్‌కు మాత్రమే పరిమితమైన టీజీ నిబంధన ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా అన్ని అధికారిక వ్యవహారాలకు వర్తింపజేసేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, తక్షణమే ఇది అమల్లోకి వచ్చిందని తెలిపారు. టీఎస్ అబ్రివేషన్ స్థానంలో అధికారికంగా టీజీ అని మార్చుకునేలా మే 30 వరకు డెడ్‌లైన్ విధిస్తున్నట్లు సీఎస్ శాంతికుమారి ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థలన్నింటికీ ఇది వర్తిస్తుందన్నారు. వెబ్‌సైట్లతో పాటు ఎలక్ట్రానిక్ డాక్యుమెంట్స్, రిపోర్టుల్లోనూ టీజీ పదాన్నే వినియోగించాలని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం టీజీ అనే అబ్రివేషన్‌ను అధికారికంగా గుర్తించడంతో పాటుగా మార్పును అన్ని విభాగాలూ అమల్లోకి తెచ్చేలా ఆయా డిపార్ట్‌మెంట్ కార్యదర్శులు, హెచ్‌ఓడీలు పర్యవేక్షించాలని సీఎస్ శుక్రవారం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారని తెలిపారు. టీఎస్‌పీఎస్సీ, టీఎస్‌ఆర్టీసీ తదితర పేర్లతో కొనసాగుతున్న సంస్థలు ఇకపైన టీజీపీఎస్సీ, టీజీఆర్టీసీ అని మార్చుకోవాలన్నారు. ప్రభుత్వ వివిధ శాఖలు, విభాగాల మధ్య జరిగే అంతర్గత కరస్పాండెన్స్ (ప్రత్యుత్తరాలు)తో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వ్యవహారంలోనూ టీజీ అనే అబ్రివేషన్‌నే వినియోగించాలన్నారు. అన్ని శాఖలు, విభాగాలు ఈ మార్పులు చేపట్టిన అంశంపై ఆయా శాఖల కార్యదర్శులు ఈ నెల 30 వరకు సాధారణ పరిపాలన శాఖ జాయింట్ సెక్రటరీ (కోఆర్డినేషన్)కు రాతపూర్వకంగా (యాక్షన్ టేకెన్ రిపోర్టు) తెలియజేయాలని సీఎస్ తాజా ఉత్తర్వుల్లో పేర్కొన్నారని.. అన్ని కార్యాలయాల్లో టీఎస్ కు బదులు టీజీగా మారుస్తూ ఈ నెల 26లోగా నివేదికలు సమర్పించాలని శాఖల అధికారులను ఆదేశించారు.

క్లుప్తంగా

వెంకన్న స్వామికి అభిషేకం


స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

కొడంగల్‌ : పేదల తిరుపతిగా పేరుగాంచిన పట్టణంలోని పద్మావతీ సమేత మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఉదయం విశేష పూజలు చేశారు. శ్రీవారి మూలమూర్తికి అభిషేకం చేశారు. వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా నిత్యపూజలు, కైంకర్యాలు, అర్చనలు నిర్వహించారు. పాలు, పెరుగు, తేనే, నెయ్యి, పసుపు, చందనం వంటి సుగంధ ద్రవ్యాలతో స్వామివారి మూలమూర్తికి అభిషేకం చేశారు. స్వామివారు నిజరూపంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వృద్ధుడి అదృశ్యం

మీర్‌పేట: మతిస్థిమితం లేని ఓ వృద్ధుడు అదృశ్యమైన ఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. ఎస్‌ఐ సుధాకర్‌ కథనం ప్రకారం.. మీర్‌పేట కేశవరెడ్డినగర్‌కు చెందిన బాలయ్య (80) గత కొన్ని రోజుల క్రితం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రా లేదు. ఆ చూకీ కోసం వెతికినా ప్రయోజనం లేకపోవ డంతో కుమారుడు మాధవదాసు శనివారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోహింగ్యా యువకులపై కత్తితో దాడి

పహాడీషరీఫ్‌: రోహింగ్యా యువకులపై కత్తితో దాడి చేసిన ఘటన బాలాపూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలాపూర్‌ రాయల్‌ కాలనీలో క్యాంప్‌–1లో నివాసం ఉంటున్న మహ్మద్‌ ఫర్హాన్‌(19), మైనర్లు నజీముల్లా, మహ్మద్‌ యాసిర్‌లు శుక్రవారం అర్ధరాత్రి స్థానిక రోడ్డుపై ఉన్నారు. ఇదే సమయంలో కొత్తపేటలో ఫుట్‌బాల్‌ ఆట ముగించుకొని తమ క్యాంప్‌ వద్దకు వస్తున్న రోహింగ్యా తెగకు చెందిన మహిబుల్లా, మహ్మద్‌ షర్ఫిక్‌లు బైక్‌పై వస్తున్నారు. వీరిని అడ్డుకుని ఫర్హాన్‌ గ్రూప్‌ సిగరేట్‌ కావాలని అడిగింది. తమ వద్ద లేదని చెప్పినా వినకుండా కత్తితో మహిబూల్లా, షర్ఫిక్‌లపై దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు నిందితులపై 307 సెక్షన్‌ కింద కేసు నమోదు చేశారు.

పామాయిల్‌తో లాభాలు

కొందుర్గు: పామాయిల్‌ సాగుతో అధిక లాభాలు పొందవచ్చని జిల్లా మేనేజర్‌ ప్రమోద్‌కుమార్‌ అన్నారు. శనివారం మండలంలోని తంగెళ్లపల్లిలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన హాజరై మాట్లాడారు. తేలిక పాటి నేలల్లోనూ పామాయిల్‌ సాగు చేసుకోవచ్చని, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. ఇతర పంటలతో పోలిస్తే నికర లాభాలు అందించే ఏకైక పంట పామాయిల్‌ అని చెప్పవచ్చన్నారు. ఈ పంటలో మొక్కజొన్న, పత్తి, కూరగాయలు, చిరుధాన్యాలు అంతర పంటలుగా సాగుచేసుకోవచ్చన్నారు. పామ్‌ ఆయిల్‌ పంట సాగుకు ప్రభుత్వం రాయితీ అందిస్తుందని, మార్కెటింగ్‌ సదుపాయం కూడా కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్‌ ఆఫీసర్‌ మల్లారెడ్డి, ఏఈఓ అనూష, రామకృష్ణ, మాజీ సర్పంచ్‌ బాల్‌రాజ్‌, రైతులు పాల్గొన్నారు.

వానలు వణికిస్తున్నాయి

ఆందోళనలో రైతన్నలు


ధాన్యంపై కవర్లు కప్పుతున్న రైతులు

ధారూరు: అకాల వర్షాలు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఆరబెట్టిన ధాన్యం ఎక్కడ తడిసి ముద్దవుతుందోనని ఆందోళన చెందుతున్నారు. మండలంలోని నాగసమందర్‌, గట్టిపల్లి, ధారూరు, నాగారం, గురుదోట్ల, మోమిన్‌కలాన్‌ తదితర గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. వానాలకు భయపడిన రైతులు హర్వెస్టర్ల కోసం పోటీపడి తీసుకువచ్చి వరిని కోయించి ఆరబెడుతున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబెట్టిన ధాన్యాన్ని తాడిపత్రిలు ఉన్నా వాన పడగానే కింద నుంచి వడ్లలోకి నీరు చేరి ధాన్యం తడిసిపోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. తేమ శాతాన్ని లెక్కించకుండా తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని వారు డిమాండు చేశారు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తరలించడానికి నానా అవస్థలు పడుతున్నామని, సంచులు లేక, కొనుగోలు కేంద్రాల్లో ఇవ్వక ట్రాక్టర్లలో తీసుకువచ్చి కొనుగోలు కేంద్రాల వద్దే ఆరబెడుతన్నామని పేర్కొన్నారు. సీఎం తడిసిన ధాన్యాన్ని కొంటామని చెబుతుంటే కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలు మాత్రం 17 శాతం కన్నా తేమ శాతం తక్కువ ఉంటేనే కొంటామని తిరస్కరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ దీనస్థితిని చూసైన తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని వారు కోరుతున్నారు.

ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం తగదు

జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్‌


రైతులతో మాట్లాడుతున్న డీఏఓ గోపాల్‌

దోమ : ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్‌ అధికారులను హెచ్చరించారు. శనివారం మండల పరిధిలోని బొంపల్లిలోని కొనుగోలు కేంద్రాన్ని అకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోళ్లు ఎలా జరుగుతున్నాయని రైతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులు తీసుకువచ్చిన ధాన్యాలను ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేయాలని నిర్వాహకులకు సూచించారు. ప్రభుత్వం కల్పించిన మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలని తెలిపారు. గొనె సంచులు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు. సెంటర్‌కు లారీలు సక్రమంగా రావడం లేదని, దీంతో ధాన్యం సెంటర్ల వద్ద ఉంటున్నాయని రైతులు డీఏఓ దృష్టికి తీసుకురాగా, లారీలు వచ్చేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్‌రావు, గ్రామ రైతులు తుల్జా నాయక్‌, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్‌

కొడంగల్‌ : మండల పరిధిలోని పర్సాపూర్‌, అప్పాయిపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం తహసీల్దార్‌ విజయ్‌కుమార్‌ పరిశీలించి, నిర్వాహకులతో మాట్లాడారు. రైతులకు న్యాయం చేయడం కోసం ఐకేపీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తేమ శాతం విషయంలో రైతులకు నష్టం జరగకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ


ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏఓ అనురాధ

బొంరాస్‌పేట: మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాన్ని శనివారం మండల వ్యవసాయాధికారిణి అనురాధ అకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణంలోని ఎరువులు, పురుగుల మందులు, వాటి పరిమితులు, లైసెన్స్‌ తదితర రికార్డులు ఆమె పరిశీలించారు. నిర్ణయించిన ధరలకే అమ్మాలని సూచించారు. అధిక ధరలకు విక్రయించరాదన్నారు. రైతులకు అవసరమైన ఎరువులు, మందులు అందుబాటులో ఉంచాలని కోరారు. కల్తీ ఎరువులు, మందులు అమ్మోద్దని హెచ్చరించారు.

మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి


నర్సరీని పరిశీలిస్తున్న ఏపీవో సుశీల, సంధ్య

మండల ఏపీవో సుశీల

మొయినాబాద్‌రూరల్‌: నర్సరీల్లో పెంచుతున్న మొక్కలు ఎండిపోకుండా ప్రత్యేక దృష్టి సారించాలని మండల ఏపీవో సుశీల అన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్‌ గ్రామ సమీపంలో గల నర్సరీని పంచాయతీ కార్యదర్శి సంధ్యతో కలిసి ఆమె పరిశీలించారు. నర్సరీలో పెరుగుతున్న మొక్కలను చూసి బాగా ఎదిగాయని తెలిపారు. గ్రామాల్లో పెంచుతున్న మొక్కలు వర్షాకాలం నాటికి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ వర్షాకాలంలో ప్రజలకు సరిపడే మొక్కలు అందించేందుకు ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్‌ 10 వేలు కాకుండా మరొక వేయి మొత్తం 11 వేల మొక్కలను పెంచుతున్నట్లు పంచాయతీ కార్యదర్శి సంధ్య తెలిపారు. నర్సరీలో కానుగ, ఆశోక, జిందాతిలిస్మాత్‌, తులసి, మల్లె, గులాబీ, కరివేపాకు, బాదం, తదితర మొక్కలను పెంచుతున్నట్లు ఆమె తెలిపారు. నర్సరీని పరిశీలించిన ఏపీవో మొక్కలు ఎండిపోకుండా నిత్యం చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు వ్యక్తులకు రిమాండ్‌

కుల్కచర్ల: ఓ వ్యక్తిపై హత్యాయత్నానికి పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన చౌడాపూర్‌ మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌడాపూర్‌ మండలం మరికల్‌ గ్రామానికి చెందిన పెద్ద ముసలిగళ్ల నర్సింలు అనే వ్యక్తిపై అదే గ్రామానికి చెందిన తలారి నర్సింలు, విష్ణు, నవీన్‌ వ్యక్తిగత విభేదాలతో ఈ నెల 8న మరికల్‌ గ్రామ శివారులో నర్సింలుపై హత్యాయత్నానికి పాల్పడ్డారు. కేసు నమోదు చేసుకున్న మహబూబ్‌నగర్‌ జిల్లా నవాబుపేట మండల పోలీస్‌స్టేషన్‌ ఎస్‌ఐ అభిషేక్‌ రెడ్డి నిందితులను శనివారం పరిగి కోర్టులో హాజరుపరిచి, వారిని 14రోజుల పాటు జ్యుడిషియల్‌ రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

యువతి అదృశ్యం


శివాని (ఫైల్‌)

కుల్కచర్ల: ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన కుల్కచర్ల పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌడాపూర్‌ గ్రామానికి చెందిన బండి శివాని(19), కుల్కచర్లలోని ఒక కళాశాలలో ఇంటర్మీడియట్‌ పూర్తి చేసి ఇంటి దగ్గర ఉంటుంది. కాగా, శుక్రవారం మీసేవా కేంద్రానికి వెళ్లి వస్తానని సోదరికి చెప్పి బయటకు వెళ్లింది. సాయంత్రమైన ఇంటికి రాకపోవడంతో చుట్టూ పక్కల వెతకగా ఆచూకీ లభించలేదు. దీంతో శివాని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ జైపాల్‌రెడ్డి పేర్కొన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య


బందెప్ప మృతదేహం

బొంరాస్‌పేట: భార్యాభర్తల మధ్య గొడవల కారణంగా మనస్తాపానికి గురై భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం దుద్యాల మండలంలోని చిల్మల్‌మైలారంలో చోటు చేసుకుంది. ఎస్సై ఎండీ రవూఫ్‌ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మ్యాతరి బందెప్ప(34) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. గత కొన్ని రోజులుగా కుటుంబ సమస్యల కారణంగా భర్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండేవి. దీంతో మనస్తాపానికి గురైన బందెప్ప ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండి అంజిలయ్య ఫిర్యాదు మేరకు భార్య అపర్ణపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవూఫ్‌ తెలిపారు.

శంకర్‌పల్లిలో 'చందన బ్రదర్స్‌'

సాక్షి, రంగారెడ్డి జిల్లా: తెలంగాణ ప్రజలకు ఎంతో సుపరిచితమైన ప్యాట్నీ సెంటర్‌ చందన బ్రదర్స్‌.. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లిలో కొత్త బ్రాంచిని ప్రారంభించింది. ప్రముఖ సినీతార నేహాశెట్టి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య తదితరులు శనివారం షోరూంను ప్రారంభించారు. కుటుంబంలోని వారందరికీ కావాల్సిన వస్త్రాలను హోల్‌ సేల్‌ ధరలకే అందించనున్నట్లు సంస్థ అధినేత అల్లక సత్యనారాయణ తెలిపారు. షాపింగ్‌ మాల్‌ ఓపెనింగ్‌ ద్వారా స్థానికంగా ఉన్న 150 మందికి ఉపాధి లభించనుందని ప్రకటించారు.



ఆటోట్రాలీ, బైక్‌ ఢీ

ఒకరు మృతి, మరొకరికి తీవ్రగాయాలు


మృతుడు సందీప్‌కుమార్‌


తీవ్రంగా గాయపడ్డ రోమియో

కందుకూరు: ఆటోట్రాలీ, బైక్‌ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన కందుకూరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ మక్బూల్‌జానీ తెలిపిన వివరాలు.. కడ్తాల్‌ గ్రామ పరిధి బటర్‌ఫ్లై సిటీ వెంచర్‌లో కొలపల్లి సందీప్‌కుమార్‌(44) సూపర్‌వైజర్‌గా పని చేస్తూ అక్కడే నివసిస్తున్నాడు. శనివారం ఉదయం హైదరాబాద్‌కు మరో వ్యక్తి రోమియోతో కలిసి బైక్‌పై వెళ్లాడు. సాయంత్రం తిరిగి కడ్తాల్‌కు బయలుదేరారు. మార్గమధ్యలో శ్రీశైలం రహదారిపై గూడూరు గేట్‌ ఎస్‌ఆర్‌ఐ కళాశాల సమీపంలో ముందు వెళ్తున్న మహీంద్రాజెన్‌ ఆటోట్రాలీ ఎలాంటి సిగ్నల్‌ ఇవ్వకుండా రైట్‌టర్న్‌ తీసుకున్నాడు. దీంతో వెనక నుంచి వస్తున్న బైక్‌ ఆ ఆటోట్రాలీని ఢీకొట్టింది. దీంతో బైక్‌ నడుపుతున్న సందీప్‌ కుమార్‌ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తికి తీవ్రగాయాయి. చికిత్స నిమిత్తం 108 వాహనంలో హైదరాబాద్‌ తరలించారు. మృతుడికి భార్య లక్ష్మి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రావణ్‌ పేర్కొన్నారు.

డీసీఎం వాహనం బోల్తా


చిందర వందరగా పడిన మొక్కజొన్న బస్తాలు

కందుకూరు: మొక్కజొన్న లోడుతో వెళ్తున్న డీసీఎం వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటన శనివారం కందుకూరు పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. కడ్తాల్‌ నుంచి మొక్కజొన్న బస్తాలను నింపుకుని హైదరాబాద్‌ వైపు వస్తున్న డీసీఎం వాహనం.. శ్రీశైలం రహదారిపై దెబ్బడగూడ గేట్‌ సమీపంలో అదుపు తప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు చికిత్స నిమిత్తం అతడిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. కాగా, రోడ్డు జామ్‌ కాకుండా వెంటనే మరొక వాహనంలో మొక్కజొన్న బస్తాలను నింపి తరలించారు.

ఆయిల్‌పామ్‌ సాగుపై అవగాహన


డైరీని ఆవిష్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కందుకూరు: పంటల సాగులో అధికారుల సలహాలు, సూచనలు పాటిస్తూ లబ్ధిపొందాలని ఎంపీపీ మంద జ్యోతిపాండు, జెడ్పీటీసీ సభ్యుడు బొక్క జంగారెడ్డి రైతులకు సూచించారు. శనివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఆయిల్‌పామ్‌ సాగుపై ఉద్యాన, వ్యవసాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వాలు అందించే ప్రోత్సాహకలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉద్యాన శాఖ ఏడీహెచ్‌ సంజయ్‌కుమార్‌ మాట్లాడుతూ.. నీటి వసతి ఉన్న రైతులు ఆయిల్‌ పామ్‌ను సాగు చేసుకోవచ్చన్నారు. చీడపీడల బాధ తక్కువగా ఉంటుందని చెప్పారు. ఎకరాకు 8–12 టన్నుల దిగుబడి వస్తుందన్నారు. ఆయిల్‌ పామ్‌ పంటకి ప్రభుత్వం మొక్కలకు 90 శాతం రాయితీ, డ్రిప్‌ ఇరిగేషన్‌కు 80–100 శాతం రాయితీ ఇస్తుందన్నారు. మొక్క నాటిన నాలుగేళ్ల వరకు ఎకరాకు రూ.4200 చొప్పున నిర్వహణ ఖర్చులు ఇవ్వనున్నారని తెలిపారు. నాలుగేళ్ల నుంచి 30 సంవత్సరాల వరకు దిగుబడి వస్తుందన్నారు. వ్యాల్యు ఆయిల్‌ కంపెనీ వైస్‌ ప్రెసిడెంట్‌ రామ్మోహన్‌రావు మాట్లాడుతూ.. ఆయిల్‌పామ్‌ రైతులను ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నామని, మండలానికి ఒక ఫీల్డ్‌ అధికారిని నియమించి నిరంతరపంట పర్యవేక్షణ జరుగుతుందని వెల్లడించారు. కార్యక్రమంలో ఏడీఏ సుజాత, ఏఓ లావణ్య, ఏఈఓలు రాజు, రాఘవేంద్రచారి, నాయకులు జి.ప్రభాకర్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి కృషి


విరాళం అందజేస్తున్న మహేందర్‌, తదితరులు

షాబాద్‌: దేవాలయాల అభివృద్ధికి బీజేపీ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని బీజేవైఎం యువ మోర్చా జిల్లా అధికార ప్రతినిధి కూతురు మహేందర్‌ పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని అంతిరెడ్డిగూడ గ్రామంలో బీరప్ప దేవాలయ నిర్మాణానికి పార్టీ తరపున రూ.20వేల రూపాయలు విరాళంగా ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతోనే ప్రతీ ఒక్కరికి మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. గ్రామాల్లో బీరప్ప దేవాయాల నిర్మాణానికి ప్రజలు తమవంతు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కావలి శివ, సీహెచ్‌ రాజు, సాయి, అరుణ్‌, సురేశ్‌, రమేశ్‌, శ్రీనివాస్‌, నవీన్‌, వివేక్‌, కుమార్‌, శంకరయ్య, దయాకర్‌చారి, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

స్కూల్‌ గేటు ఎదుట బాధితుల ఆందోళన


ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు, నాయకులు

మొయినాబాద్‌: సమ్మర్‌ క్యాంపు నిర్వహించి విద్యార్థి మృతికి కారణమైన సుజాత స్కూల్‌ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలంటూ బాధిత కుటుంబ సభ్యులు, సురంగల్‌ గ్రామస్తులు, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్‌ చేశారు. శనివారం మండలంలోని నాగిరెడ్డిగూడ రెవెన్యూలోని పాఠశాల గేటు ఎదుట కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన చేశారు. సమ్మర్‌ క్యాంపులో సురంగల్‌ గ్రామానికి చెందిన గాండ్ల శివశౌర్యన్‌(5) స్విమ్మింగ్‌పూల్‌లో మునిగి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై అధికారులు, పోలీసులు చర్యలు తీసుకోవడం లేదంటూ బాధిత కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఘటన జరిగి పది రోజులు అవుతున్నా పాఠశాల యాజమాన్యంపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలను సీజ్‌ చేయాలన్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

చేవెళ్ల: గుర్తు తెలియని యువకుడు చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధి శనివారం చోటు చేసుకుంది. పోలీసులు వివరాలు..శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని బుల్కాపూర్‌ సమీపంలోని రైల్వే ట్రాక్‌ పక్కన చెట్టుకు ఓ యువకుడు (35) ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం ట్రెన్‌లో వెళ్తున్న ప్రయాణికులు గమనించి 100డయల్‌కు ఫోన్‌ చేసి చెప్పడంతో పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించారు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. అధికారుల ఫిర్యాదు మేరకు గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఫత్తేపూర్‌ ఫ్లైఓవర్‌ బ్రిడ్జి వద్ద ట్రాఫిక్‌జామ్‌


ట్రాఫిక్‌జామ్‌తో నిలిచిపోయిన వాహనాలు

ఇబ్బందిపడిన వాహనదారులు

చేవెళ్ల: శంకర్‌పల్లి మున్సిపల్‌ కేంద్రంలోని ఫత్తేపూర్‌ ఫ్లైఓవర్‌ బ్రిడ్జి వద్ద భారీగా ట్రాఫిక్‌ జామ్‌ కావడంతో వాహనదారులు ఇబ్బందిపడ్డారు. శనివారం శంకర్‌పల్లిలోని ఫత్తేపూర్‌ ఫ్లైఓవర్‌ బ్రిడ్జి కింద నుంచి భారీ వాహనాలు పోవడం లేదని ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డు తవ్వి మరమ్మతులు చేపట్టారు. దీంతో ఈ బ్రిడ్జి వద్ద నుంచి వచ్చి పోయే వాహనాలకు ఇబ్బంది ఏర్పడింది. దీనికి తోడు శంకర్‌పల్లిలో భారీ వర్షం కురవడంతో వాహనదారులకు నరకయాతనగా మారింది. ఈ బ్రిడ్జి వద్ద వన్‌వే రోడ్డు మాత్రమే ఉండడంతో నిత్యం ట్రాఫిక్‌ ఇబ్బందులు ఎదుర్కొంటున్న వాహనదారులు ఈ మరమ్మతులతో మరింత ట్రాఫిక్‌జామ్‌ అయింది. ఈ బ్రిడ్జి వద్ద రోడ్డు సైతం గుంతలమయంగా ఉండటంతో నరకయాతన పడుతున్నారు. మరమ్మతుల కారణంగా రోడ్డుపై వాహనాలు కిలోమీటర్ల పొడవునా ట్రాఫిక్‌ జామ్‌తో శంకర్‌పల్లి పట్టణ కేంద్రం వరకు వాహనాలు నిలిచిపోయాయి. ఈ రోడ్డుపై వచ్చిన వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు ముందుగా ఈ రోడ్డుపై, ఫ్లైఓవర్‌పై ఏర్పడిన గుంతలను పూడ్చివేయాలని కోరుతున్నారు.